# విద్యుత్ సరఫరాలో అంతరాయమే..

**ఆందోళన చేపట్టిన ప్రజలు**



గట్టుఇప్పలపల్లి గ్రామంలోని సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

కడ్తాల్, జూన్ 18: విద్యుత్ సరఫరాలో తరుచూ కలుగుతున్న అంతరాయంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్తులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో చిన్నపాటి వాన కురిసినా, ఈదురుగాలులు వీచినా వెంటనే అధికారులు విద్యుత్‌ను నిలిపివేస్తున్నారని తెలిపారు. విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలన్నారు.

తలకొండపల్లి మండల కేంద్రం నుంచి గట్టుఇప్పలపల్లి గ్రామం వరకు ప్రత్యామ్నాయ విద్యుత్ మార్గానికి, గత బీఆర్ఎస్ పాలనలో అప్పటి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.కోటి మంజూరు చేయించారని గుర్తు చేశారు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు టెండర్ పూర్తి చేసి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభించడంలేదని విమర్శించారు. అధికారులు త్వరగా పనులను చేపట్టాలని లేని పక్షంలో మండల కేంద్రంలోని ఏఈ కార్యాలయం ఎదుట ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మవెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శిరీషకృష్ణయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు జంగయ్య, నాయకులు శరత్‌చంద్రశర్మ, అశోక్‌గౌడ్, కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, విజయ్ పాల్గొన్నారు.

## నిషేధిత జాబితా నుంచి రైతుల పేర్లను తొలగించాలి



యాచారం, జూన్18: ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల పేర్లను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ అయ్యప్పకు బుధవారం బాధిత రైతులు వినతి పత్రం అందజేశారు. ఫార్మాసిటీకి భూములు ఇవ్వని 2500 ఎకరాలకు వెంటనే రైతు భరోసా అందించేందుకు అధికారులు కృషి చేయాలని రైతులు తహసీల్దార్‌ను కోరారు. ఫార్మాకు ఇవ్వని భూముల వద్దకు అధికారులు పోలీసులు రావద్దని వారు సూచించారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించొద్దని సూచించారు. ఫార్మా బాధిత రైతుల ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఆందోళనలు తప్పవని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు, జూన్ 18: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుందని కొత్తూరు ఎంఈవో అంగూర్‌నాయక్ బుధవారం తెలిపారు. 01-09-2016 నుంచి 30-08-2017 మధ్య జన్మించి ఎనిమిది నుంచి తొమ్మిది ఏండ్ల వయస్సు కలిగిన వారు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌ల్లో ఉన్న క్రీడా పాఠశాలలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుందన్నారు. కొత్తూరు ఉన్నత పాఠశాలలో 19న గురువారం ఉదయం 10 గంటలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొనాలని ఆయన వివరించారు. ఇతర వివరాలకు నవనీత 9963081675, శ్రీలత 9704941074 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

## రుణాలు సకాలంలో చెల్లించాలి

చేవెళ్ల టౌన్, జూన్ 18: రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని నాబార్డ్ డీజీవో సుధాకర్, డీడీఎం హర్ష, డీసీసీబీ ఎఫ్ఎల్సీ లక్ష్మీకాంత్, డీసీవో అధికారి నాగేశ్వర్ అన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సొసైటీ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నాబార్డ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సొసైటీలో రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి ఉత్తమ ఖాతాదారులుగా ఎంపికైన అత్తెల్లి మధుసూదన్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి, ఆనంద్‌ను సన్మానించారు. అదే విధంగా సొసైటీ కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్రాంచీ మేనేజర్ బాలకృష్ణ, కార్యదర్శి వెంకటయ్య, డైరెక్టర్స్ మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్యాలమయ్య, నర్సింహులు, రాములు, సొసైటీ సిబ్బంది, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేలా చర్యలు

చేవెళ్ల రూరల్, జూన్ 18 : వనమహోత్సం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ సూచించారు. బుధవారం ఆయన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గిరాజ్, ఏపీవో నాగభూషణం, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పెంజర్ల బీఆర్ఎస్ అధ్యక్షుడిగా జంగయ్య

కొత్తూరు, జూన్ 18: పెంజర్ల బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, నాయకుడు ఎమ్మె సత్యనారాయణ హాజరయ్యారు. అధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షుడిగా రాములును బుధవారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మండల కార్యదర్శి రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జైపాల్, మాజీ సర్పంచ్‌లు వనంబాల్‌రాజ్, నాయకులు భీమయ్య, శేఖర్, పోచయ్య, దస్తగిరి, యాదయ్య ఉన్నారు.

## నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

షాద్‌నగర్‌టౌన్, జూన్ 18: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలో నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఎంఈవో మనోహర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో సకల సదుపాయాలను కల్పిస్తామని చెబుతూ అధిక ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. అదే విధంగా ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఇతర సామగ్రిని విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, వినయ్, తరుణ్ పాల్గొన్నారు.


## ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

షాద్‌నగర్‌టౌన్, జూన్ 18: పెంచిన బస్‌పాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్‌పాస్ చార్జీల పెంపుతో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ఎంతో మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి బస్సులో ప్రయాణిస్తూ విద్యను అభ్యసిస్తున్నారని, అలాంటి విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను పెంచడం సరికాదన్నారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకాష్, రాహుల్, శ్రీను పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును పూర్తి చేయాలి

ఆమనగల్లు, జూన్ 18: ఆమనగల్లులో పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును త్వరగా పూర్తి చేయాలని బుధవారం ఏఎంసీ డైరెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్వరలోనే అసంపూర్తి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఎంసీ డైరెక్టర్లు నరేష్‌నాయక్, జెల్ల రమేష్, సంపత్ ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ



బీఆర్ఎస్ నాయకుడు సుధాకర్‌ను పరామర్శిస్తున్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, జూన్ 18: మండలంలోని ముద్దెంగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పర్వేద సుధాకర్ ఇటీవల అనారోగ్యానికి గురై నగరంలోని ఓ దవాఖానలో శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి బుధవారం గ్రామంలోని సుధాకర్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పర్వేద నర్సింహులు, గ్రామ మాజీ సర్పంచ్ జయమ్మ, పార్టీ నాయకులు సుదర్శన్, శేఖర్, నరేష్ పాల్గొన్నారు.

## పల్లె దవాఖాన ఏర్పాటుకు కృషి



పల్లెదవాఖాన ఏర్పాటుకు భవనాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్

యాచారం, జూన్18: మండలంలోని మేడిపల్లి గ్రామంలో పల్లె దావకాన ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. మేడిపల్లి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాత హాస్టల్ భవనాన్ని బుధవారం ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న పాత హాస్టల్ భవనంలో పల్లె దవాఖానను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు.

## ట్రైనీ ఐఈఎస్ అధికారుల పర్యటన



గ్రామంలో పర్యటించిన ట్రైన్ ఐఈఎస్ అధికారుల బృందం

యాచారం, జూన్18: మండల పరిధిలోని గడ్డ మల్లయ్యగూడా గ్రామంలో ట్రైనీ ఐఈఎస్ (ఇండియన్ ఎకనామిక్ సర్వీస్) అధికారులు బుధవారం పర్యటించారు. గ్రామంలోని సర్పంచ్, ఉప సర్పంచ్, డ్వాక్రా సంఘాల మహిళలతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న సమస్యలు వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్లపై చర్చించారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి, వనం డంపింగ్ యార్డ్, వైకుంఠధామం, నర్సరీలు, హరితహారం మొక్కలను పరిశీలించారు. ఉపాధి హామీ పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా ఇక్కడి అభివృద్ధి పనులను అధ్యయనం చేసేందుకు గ్రామాన్ని సందర్శించినట్లు ట్రైనీ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మాధవరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో బాల శంకర్, ఎంపీవో శ్రీలత, ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఈజీఎస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిల్లులు వెంటనే చెల్లించాలి

**కలెక్టర్ నారాయణరెడ్డి**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, జూన్ 18: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండింగ్, బేస్మెంట్ లెవెల్ పూర్తి చేయాలని, వాటికి బిల్లులు చెల్లించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇండ్లు గ్రామ, మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం, వనమహోత్సవం కార్యక్రమంపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 56.33శాతం ఇండ్ల గ్రౌండింగ్ అయ్యాయని, 43శాతం ఇంకా కావాల్సి ఉందన్నారు.

**పెండింగ్‌లో పెట్టొద్దు..**

జూన్ 25 వరకు ఎలాంటి ఇండ్లు పెండింగ్ లేకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేద కుటుంబం మహిళకు బ్యాంక్ లింక్ రుణాలు మంజూరు చేయాలని అన్నారు. ఈనెల 25లోపు ఇంకా ప్రారంభించని ఇండ్ల జాబితాను రద్దుచేసి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని అన్నారు.

**పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్..**

గ్రామ మున్సిపల్ పరిధిలో ఈనెల 20 నుంచి 28 వరకు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైన్లు క్లీన్ చేయించి రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా లీకేజీ లేకుండా చూడాలని పంచాయతీ, మున్సిపల్ లో అన్ని గుంతలు, కల్వర్టులు పూడ్చాలన్నారు. గ్రామాల్లో వీధి దీపాలు లేని ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేయాలని, ఈ విషయంపై పెద్ద ఎత్తున స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జులై 1,2,3 తేదీల్లో గ్రామాలకు మున్సిపాలిటీలకు ఆడిట్ టీమ్‌లు సందర్శించి పరిశీలిస్తారని కలెక్టర్ తెలిపారు.

వన మహోత్సవంపై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన మేరకు మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని, గుంతలు ఏర్పాటు చేయాలని, అవసరమైన మొక్కలు నర్సీల్లో అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో డీఆర్వో సంగీత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, డీపీవో సురేశ్ మోహన్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్‌కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి కేషురామ్, పీడీ హౌసింగ్ హనుమంతునాయక్, గ్రామీణ అభివృద్ధి శాఖ పీడీ శ్రీలత, మెప్మా పీడీ మల్లీశ్వరి, డీఈవో సుశీందర్‌రావు పాల్గొన్నారు.

**దరఖాస్తులను వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలి**

భూభారతి చట్టం జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే సంబంధిత వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు.

## అదృశ్యమైన వివాహిత ఆచూకీ లభ్యం





సుజాతను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కేశంపేట, జూన్ 18 : ఇంట్లో గొడవపడి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన వివాహిత ఆచూకీని కేశంపేట పోలీసులు బుధవారం కన్నుగొన్నారు. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామానికి చెందిన డోల సుజాత(40) ఈ నెల 2న రాత్రి సమయంలో తన పెద్దకుమారుడితో గొడ పడిందని, 3న ఉదయం ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. ఈ విషయమై బాధితురాలి భర్త శేఖర్ 14న పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు సుజాత ఆచూకీ తెలుసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. సుజాతతోపాటు కుటుంబ సభ్యులకు ఎస్ఐ రాజ్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును చేధించిన కేశంపేట పోలీసులకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సన్మానం




బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ బాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్‌లను సన్మానిస్తున్న ఎస్ఐ వెంకటేష్

ఆమనగల్లు, జూన్ 18: సాధారణ బదిలీలో భాగంగా ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బాల్‌రెడ్డి కడ్తాల్ పోలీస్ స్టేషన్, హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ బాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్‌లను ఘనంగా సన్మానించారు.

## కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చాలి

ఆమనగల్లు, జూన్ 18: గత అసెంబ్లీ ఎలక్షన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ జడ్పీటీసీ నేనావత్ అనురాధ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని దుయ్యబట్టారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రైతులతో కలిసి ప్రతి గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు ఇంటి ఎదుట ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ రమేశ్‌నాయక్, నాయకులు పంతూనాయక్, శ్రీనూనాయక్, సాలయ్య, సాయిలు మహిళా విభాగం అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు సైదులగౌడ్, వెంకటేష్, జగన్, హేమ్లానాయక్, పంతూనాయక్, యాదయ్య, శ్రీకాంత్, హరిచంద్‌నాయక్, తౌర్యానాయక్ ఉన్నారు.

## మహిళల రక్షణే షీ టీమ్స్ కర్తవ్యం



షాద్‌నగర్‌రూరల్, జూన్18 : మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే షీ టీమ్స్ కర్తవ్యం అని షీ టీమ్స్ ఇన్‌చార్జి బుచ్చయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం బాలికల సాంఘిక సంక్షేమ గురుకులలో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని అవగహన కల్పించారు. విద్యార్థినులు చిన్నతనం నుంచే ఆత్మస్థైర్యంను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థినులకు ఫోక్సోయాక్ట్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యులత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం



షాబాద్, జూన్ 18: మండలంలోని కుమ్మరిగూడ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించారు. నాలుగు రోజుల క్రితం గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో పాటుగా ఉన్న రెండు బోర్లు పాడవడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కుమ్మరిగూడలో తాగునీటి గోస అనే కథనానికి అధికారులు, గ్రామ పెద్దలు స్పందించారు. బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ కేతన రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బోరు మోటర్ ఏర్పాటు చేయించారు.

## మండల ప్రత్యేకాధికారిగా గోపికృష్ణ బాధ్యతల స్వీకరణ

కేశంపేట, జూన్ 18 : మండల ప్రత్యేకాధికారిగా గోపికృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన రాజారత్నం బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో సివిల్ సప్లై విభాగంలో రంగారెడ్డి జిల్లా మేనేజర్‌గా పని చేస్తున్న గోపికృష్ణ కేశంపేటకు వచ్చారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య ఆధ్వర్యంలో ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా మండలంలోని పలువురు రాజకీయ పార్టీల నేతలు మండల ప్రత్యేకాధికారిని సన్మానించారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేసి పారిశుధ్యం, ప్రగతికి సంబంధించిన అంశాలపై చర్చించారు. వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కార్యదర్శులు ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో అజీజ్‌అహ్మద్, టీఏ నీలకంఠ బాబు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



మొక్కలు నాటేందుకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీపీవో సురేశ్‌మోహన్

ఇబ్రహీంపట్నం, జూన్ 18 : వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి సురేష్‌మోహన్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామపంచాయతీలో రిజిస్టర్లను తనిఖీ చేశారు. అలాగే, గ్రామపంచాయతీలో ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూళ్లు చేసిన ఇంటి పన్నులను ట్రెజరీలో జమ చేయాలని సూచించారు. ప్రతిరోజు పారిశుధ్యం పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. వర్షాలు ప్రారంభమైనందున మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. చెత్తసేకరణ ట్రాక్టర్ల ద్వారా సక్రమంగా నిర్వాహణ కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం పంచాయతీ అధికారి రఘు, కార్యదర్శి శివకుమార్ తదితరులున్నారు.

## పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

చేవెళ్ల రూరల్, జూన్ 18 : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం శంకర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు తడి, పొడి చెత్త వేరు చేయడం, హోం కంపోస్టింగ్‌పై చిత్రలేఖనం, రంగోలి, వ్యాసరచన పోటీల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు శుభ్రత, స్వచ్ఛతపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోటీల్లో 100 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ కనబర్చిన 15 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే యాదయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్, సీఐ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మేనేజర్ వి.అంజన్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ బి.ఆనంద్, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలు హక్కుల సాధన కోసం పోరాటం చేయాలి



బీసీ సేన సమావేశంలో పాల్గొన్న జాతీయ అధ్యక్షుడు కృష్ణ

షాబాద్, జూన్ 18: బీసీల హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో బీసీ సేన సమావేశం నిర్వహించారు. అనంతరం బీసీ సేన యువజన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సేన మండల అధ్యక్షుడు దయాకర్‌చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, మాజీ సర్పంచ్ లింగం, గ్రామ యువజన అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి మహేందర్, కుమార్, జిల్లా నాయకులు వెంకటేష్, వరలక్ష్మి, శారదగౌడ్, నర్సింహులు, బాలరాజ్, మహేశ్ పాల్గొన్నారు.

**రిజర్వేషన్ల సాధనకు బీసీలు ఏకం కావాలి**

షాద్‌నగర్‌టౌన్ : బీసీలు 42శాతం రిజర్వేషన్లను సాధించుకునేందుకు బీసీలు ఏకం కావాలని తెలంగాణ జాగృతి షాద్‌నగర్ తాలుకా మాజీ కన్వీనర్ ముస్తఫా బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని కానీ ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వంపై బీసీలకు సంబంధించిన 42శాతం రిజర్వేషన్ల వాటాపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# మెనూ ప్రకారం భోజనాన్ని పెట్టాలి

మంచాల, జూన్ 18 : మండల పరిధిలోని ఎల్లమ్మ తండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో మాజీ ఎంపీపీ జయమ్మ బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ... ప్రతిరోజూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్. ఉపాధ్యాయులు లలిత, పంచాయతీ కార్యదర్శి ఫరాన్ పాల్గొన్నారు.

## అధిక ఫీజులు నియంత్రించాలి

కొత్తూరు, జూన్ 18: ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని కొత్తూరు ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్‌చారి అన్నారు. మండల స్థాయి ఏబీవీపీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థులను, తల్లిదండ్రుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. అలాగే దుస్తులు, స్టేషనరీ, బుక్కులు అమ్ముతూ పాఠశాలలు వ్యాపార సంస్థలుగా మారిపోయాయన్నారు. పాఠశాలలో బదిలీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని ఎంఈవో దృష్టికి తెచ్చామని చెప్పారు. ఎంఈవో పాఠశాలలను సందర్శించి నిబంధలను అతిక్రమంచిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కో కన్వీనర్ శివకుమార్‌చారి, మండల సెక్రెటరీ హర్షయాదవ్, జోగేశ్, యశ్వంత్, సందీప్‌సింగ్, రాజు, సురేశ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి సహకరిస్తాం

కడ్తాల్, జూన్ 18: తలకొండపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి సహకరిస్తామని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ అరుణమ్మ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ కేంద్రం స్లాబ్‌పై పెచ్చులు తరుచూ ఊడిపడుతున్నాయని తెలిపారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే మహిళలు, చిన్నారులు భయందోళనలకు గురువుతున్నట్లు వారు పేర్కొన్నారు. వెంటనే స్పందించిన మాజీ సర్పంచ్ అంగన్‌వాడీ కేంద్రం స్లాబ్ మరమ్మతు పనులు చేయడానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్‌యాదవ్, నాయకులు నర్సింహా, కృష్ణనాయక్, దశరథం పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిబట్ల, జూన్ 18: నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆదిబట్ల విద్యుత్ ఏఈ జయన్న తెలిపారు. గురువారం 33/ 11 కేవీ మంగళపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్ అగ్రికల్చర్ ఫీడర్ మీద లైన్లకు తాకేచెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి మంగళ్‌పల్లి వ్యవసాయ కనెక్షన్లు, సాహెబ్‌గూడ, వ్యవసాయ కనెక్షన్లు, కొంగరకలాన్ వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కావున ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.